## క్లుప్తంగా

### మొక్కలు సిద్ధం

**నవాబుపేట:** మండలంలో హరితహారం కార్యక్రమానికి సంబంధించి మొక్కలను ఆయా గ్రామాల్లో సిద్ధం చేశామని ఉపాధి హామీ ఏపీఓ జ్యోతి తెలిపారు. మండలకేంద్రంలో శనివారం మాట్లాడారు. అన్ని గ్రామాల్లో నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా ఏర్పాటు చేసినట్లు వివరించారు. కాగా రోడ్డు పక్కన నాటే సమయంలో విద్యుత్ లైన్ల కింద లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

### తనిఖీలు చేపట్టండి

**జడ్చర్ల టౌన్:** ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు చేపట్టాలని బీజేవైఎం ఆధ్వర్యంలో శనివారం ఎంఈఓ మంజులాదేవికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు నరేష్ మాట్లాడుతూ ప్రీప్రైమరీ, ప్రైమరీ స్కూల్స్ అంటూ పుట్టగొడుగుల్లా పాఠశాలలు వెలుస్తున్నాయని, వాటికి అనుమతి లేకున్నా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో నోట్‌బుక్‌లు, పుస్తకాలు విక్రయాలు జరగకుండా చూడాలని కోరారు. నాయకులు వెంకట్, జగదీశ్, శివ, భైరవ్, వెంకటేశ్, శంకర్‌లు ఉన్నారు.

### కొనసాగుతున్న ఉర్సు

**స్టేషన్ మహబూబ్‌నగర్:** జిల్లా కేంద్రం ఎర్రకుంట సమీపంలో హజ్రత్ బర్హానే బాదేషా రొహెమతుల్లా అలై దర్గా ఉర్సు వైభవంగా సాగుతోంది. దర్గా ముతవల్లీ డాక్టర్ గయాజ్‌పాషా హకంషర్ఫీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి దీపారాధన (జష్నే చిరాగే) నిర్వహించారు. అనంతరం కుల్‌హింద్ ముషాయిరా (కవి సమ్మేళనం) కార్యక్రమం చేపట్టారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం ఉదయం 9 గంటలకు ఖత్మే ఖురాన్ ఫాతేహా ఉంటుందని, దీంతో ఉత్సవాలు ముగుస్తాయని ముతవల్లీ వెల్లడించారు. వేడుకల్లో హఫీజ్ వారిస్ ఖాద్రీ, బుర్హాన్ తదితరులు పాల్గొన్నారు.

### నోట్‌బుక్స్ అందజేత

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** స్థానిక 27వ వార్డు పరిధి లోని గణేష్‌నగర్‌లో శనివారం రెడ్యూస్-రీయూజ్-రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) పై ప్రజలకు మున్సిపల్ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దాతలు మూడు పాత చీరలు, పది నోట్‌బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఆర్ఆర్ సూపర్ వైజర్ ఉమ, ఆర్‌పీ వరలక్ష్మి పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ కోత

**జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్):** పట్టణంలోని 33/11 కేవీ ఎస్ఎస్ టౌన్ 3 మెయింటెనెన్స్ వల్ల ఆదివారం విద్యుత్ కోత ఉంటుందని ఏఈ భగవంతయ్య శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మహేశ్వరీ టాకీస్, శ్రీనివాసకాలనీ, పద్మావతి కాలనీ, లక్ష్మీనగర్‌కాలనీ, వెంకటేశ్వరకాలనీ, మర్లు, టీచర్స్ కాలనీ, షాషాబ్‌గుట్ట, బీకే రెడ్డి కాలనీ, న్యూటౌన్, మెట్టుగడ్డ, అరబ్‌గల్లీ, ప్రేమ్‌నగర్, బాయమ్మతోట, సద్దలగుండు, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

### విగ్రహాల పరిశీలన

**భూత్పూర్:** తిరుపతిలో శనివారం దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దంపతులు మండలంలోని అన్నాసాగర్‌లో ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేయనున్న విగ్రహాలను పరిశీలించారు. వీరితో పాటు పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో శివనాగిరెడ్డి ఉన్నారు. గణపతి, నవగ్రహాలు తదితర విగ్రహాలను త్వరలో అందజేయాలని శిల్పులకు సూచించారు. వచ్చే నెల 17, 18, 19 తేదీల్లో విగ్రహప్రతిష్ఠ ఉంటుందని వివరించారు.

### ఉపాధిలో అవకతవకలకు తావివ్వొద్దు



**అడ్డాకుల:** మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం 13వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. డీఆర్‌డీఓ యాదయ్య, జిల్లా విజిలెన్స్ అధికారిణి శృతి, ఫైనాన్స్ మేనేజర్ హేమలత, ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ మంజుల, ఇంచార్జీ ఏపీఓ రమేష్, ఎస్ఆర్‌పీ అనిల్ హాజరయ్యారు. 2021 జూన్ 1వ నుంచి 2023 మార్చి 31 వరకు నిర్వహించిన రూ.6.90కోట్ల పనులపై రూపొందించిన నివేదికలపై చర్చించారు. రూ.58773ల పనులకు సంబంధించిన వివరణ ఇవ్వాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. కొన్ని గ్రామాల్లో కూలీ పనులకు రాని వారికి హాజరు వేశారని, కొన్నిచోట్ల పనులకు వెళ్లిన వారికి కూలీ డబ్బులు రావడం లేదని అధికారుల దృష్టికి తేవడంతో విచారణ చేపట్టారు. పనుల్లో ఎలాంటి అవకతవకలకు తావివ్వరాదని డీఆర్‌డీఓ అన్నారు. అంబుడ్స్‌మెన్ సంతోష్, విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, రైతు బంధు అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు జయన్నగౌడ్, సర్పంచులు, తదితరులు ఉన్నారు.

### ప్రణాళికతో చదవాలి

**చిన్నచింతకుంట:** ధ్యానంతో ఏకాగ్రత పెరుగుతుందని విద్యార్థులు తప్పకుండా ధ్యానం చేయాలని విశ్రాంత ఉపాధ్యాయుడు సుదర్శన్ విద్యార్థులకు సూచించారు. శనివారం అప్పంపల్లి ఉన్నత పాఠశాలలో ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రణాళిక బద్ధంగా చదువుతూ ఉన్నత శిఖరాలను చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

# పల్లెప్రగతితో మారిన రూపురేఖలు



కోడూర్ శివారులో నూతనంగా నిర్మించిన కస్తూర్బాగాంధీ పాఠశాల భవనం







మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

**మహబూబ్‌నగర్ రూరల్:** పల్లెప్రగతితో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయి. గ్రామాల్లో వివిధ సౌకర్యాలను కల్పిస్తూ అధికారులు, ప్రజాప్రతినిధులు అభివృద్ధి పరుస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రగతితో మండలంలోని కోడూర్ పచ్చదనంతో పరిశుభ్రంగా దర్శనమిస్తోంది. ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోంది. గ్రామంలో 3,001 జనాభా 620ఇళ్లు, 2,200 మంది ఓటర్లు ఉన్నారు.

**రూ. 3.87 కోట్లతో అభివృద్ధి పనులు**

గ్రామ అభివృద్ధి కోసం రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సహకారంతో ప్రభుత్వం రూ. 3.87 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. రూ. 3.35 కోట్ల వ్యయంతో కేజీబీవీ నూతన భవన నిర్మాణం, మన ఊరు – మన బడిలో భాగంగా ప్రాథమిక పాఠశాలలో రూ. 7.6 లక్షలతో మౌలిక వసతులు కల్పించారు. రూ. 40 లక్షలతో సీసీ రోడ్లు, తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని, రూ. 5 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టారు. హైవే నుంచి కోడూర్ తండా వరకు రూ. 1.37 కోట్లతో బీటీ రోడ్డు పునరుద్ధరణ, కరాటే విద్యార్థుల కోసం రూ. 5 లక్షల వ్యయంతో షెడ్ నిర్మాణం, జెడ్పీ ఉన్నత పాఠశాల భవన నిర్మాణం పూర్తి చేసేందుకు రూ. 20 లక్షల నిధులను కేటాయిస్తున్నట్లు ఇటీవల గ్రామ పర్యటనకు వచ్చిన సందర్భంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రకటించారు. ఇవే కాక గ్రామంలో గతంలో రైతువేదిక, పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డు, చెత్త సేకరణకు ట్రాక్టర్ కొనుగోలు వంటివి అనేకం చేపట్టారు. అదేవిధంగా ప్రభుత్వం చేపట్టిన హరితహారంతో పాటు పారిశుద్ధ్య పనులతో గ్రామమంతా పరిశుభ్రంగా కనిపిస్తోంది.

**వ్యాధులు ప్రబలకుండా చర్యలు**

గ్రామంలో వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా క్షేత్రస్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నాం. పారిశుద్ధ్య పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం.

– కృష్ణయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి

**పల్లె ప్రగతితోనే అభివృద్ధి**

ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రగతితోనే కోడూర్ ఎంతో అభివృద్ధి చెందింది. మరింత అభివృద్ధి చేసేందుకు నిరంతరం పాటుపడుతున్నాం. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సహకారంతో మంజూరు చేసిన నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టాం. మున్ముందు మరిన్ని పనులు చేపడతాం.

– బి.శ్రీకాంత్‌గౌడ్, సర్పంచ్, కోడూర్

## కోళ్ల ఫారం నిర్వాహకులకు నోటీసు



నోటీసు అందజేస్తున్న సర్పంచ్, కార్యదర్శి

**అడ్డాకుల:** మూసాపేట మండలం తుంకినీపూర్ శివారులో ఉన్న కోళ్ల ఫారాల నుంచి దుర్వాసన వెదజల్లుతోందని శనివారం అచ్చాయపల్లి పంచాయతీ కార్యదర్శి సంతోషి నిర్వాహకులకు నోటీసు అందజేశారు. కొన్నాళ్ల నుంచి వెలువడుతున్న దుర్వాసనతో అచ్చాయపల్లి, తుంకినీపూర్ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, చిన్న పిల్లలకు వ్యాధులు సంక్రమిస్తున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఈనేపథ్యంలో సర్పంచ్ బోయిని చంద్రశేఖర్, కార్యదర్శి సంతోషిలు అక్కడికి వెళ్లి పరిశీలించారు. మృతి చెందిన కోళ్లను గుంతల్లో వేసి వదిలేశారని, వాటిపై మట్టి వేసి పూడ్చకపోవడంతో దుర్వాసనతో పాటు ఈగలు వ్యాపిస్తున్నాయని పేర్కొన్నారు. గతంలో మూడు సార్లు నోటీసు అందజేసినా నిర్వాహకులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో మరోసారి అందజేసినట్లు సర్పంచ్ వివరించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని అన్నారు.

## దాడులకు నిరసనగా నిరాహారదీక్ష



**జడ్చర్ల టౌన్:** మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ శనివారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతియుత నిరాహార దీక్ష నిర్వహించారు. దీక్షలో కూర్చున్న వై.జీ ప్రీతమ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి మణిపూర్ రాష్ట్రాన్ని కాపాడాలని, శాంతియుత వాతావరణ నెలకొల్పాలని డిమాండ్ చేశారు. కూలివేసిన చర్చిలను పునఃనిర్మించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రెవరెండ్ విలియంబూత్, మహబూబ్‌నగర్ పట్టణ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రెవరెండ్ సుందర్‌పాల్, పాస్టర్స్ ఏలియా, ప్రకాష్, స్టీవెన్‌రాజు, రత్నం, ప్రసాద్, డేవిడ్, రాబర్ట్‌లు పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

## చంద్రయాన్ విజయంపై సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** ఇస్రో చేపట్టిన చంద్రయాన్–3 విజయంపై జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. ప్రిన్సిపాల్ మొహ్మద్ మెరాజుల్లాఖాన్ ప్రయోగం విజయవంతం కావడం గొప్ప విషయమని, భారత్ మరో మైలురాయిని దాటిందన్నారు. విద్యార్థులు ఇటువంటి విజయలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. సూపరింటెండెంట్ రామకృష్ణరావు, భాస్కరయ్య, స్వర్ణలత, సత్యనారాయణగౌడ్, రామకృష్ణ, ఖాదర్ మొయినుద్దీన్, ఆయేషా పాల్గొన్నారు.

### కోనేరులో పూడికతీత పనులు



**జడ్చర్ల టౌన్:** వెయ్యేళ్ల చరిత్ర కలిగిన పట్టణంలోని వేంకటేశ్వరస్వామి కోనేరుకు పూర్వవైభవం తీసుకువచ్చే పనులు మొదలయ్యాయి. ఎస్‌వీఎస్ ఆస్పత్రిలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డా. జయంతి స్వంత ఖర్చులతో పనులు ప్రారంభింపజేశారు. శనివారం వేదపండితులు పూజలు నిర్వహించిన అనంతరం పూడిక తీయటం ఆరంభించారు. దీంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### విద్యార్థుల హాజరుశాతం పెంచాలి

**మిడ్జిల్:** బైరంపల్లి, వస్పుల ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను శనివారం ఎంఈఓ మంజులాదేవి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల హాజరుశాతం పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించి నాణ్యత పాటించాలని అన్నారు. హెచ్ఎం సుధాకర్, ఇందిర తదితరులు ఉన్నారు.

### ఉపాధ్యాయులకు సమయపాలన అవసరం

**మహబూబ్‌నగర్ న్యూటౌన్:** ఉపాధ్యాయులకు సమయపాలన అవసరమని హన్వాడ మండల విద్యాశాఖ అధికారి రాజునాయక్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అదేవిధంగా విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### పనులు అడ్డుకున్న కార్మికులు

**మహబూబ్‌నగర్ న్యూటౌన్:** హన్వాడలో పేరుకుపోతున్న చెత్త, మురుగు కాల్వలను శుభ్రం చేసేందుకు తాత్కాలికంగా కొందరిని నియమించుకొని పనులు చేయిస్తుండగా శనివారం సమ్మెలో ఉన్న కార్మికులు అడ్డుకున్నారు. తమ సమస్యలను వారికి వివరించారు. ఇలాంటి చర్యలకు దిగడం సరికాదని పంచాయతీ కార్మికుల సంఘం నాయకులు బాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళనలు తీవ్రం చేస్తామని హెచ్చరించారు.

**మురుగు పేరుకుపోతోంది..**

**మహమ్మదాబాద్:** గ్రామాల్లో నిత్యం శుభ్రం చేసే కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఆందోళన చేపట్టడంతో చెత్త, మురుగు పేరుకుపోతున్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేఎం నారాయణ, రాఘవేందర్‌రెడ్డి శనివారం అన్నారు. మహమ్మదాబాద్ లాంటి గ్రామాల్లో సమస్య మరింత ఎక్కువయ్యిందని తెలిపారు. వర్షాకాలంలో ప్రజలు వ్యాధులబారిన పడే అవకాశం ఉందని ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించి, కార్మికులు విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ

**జడ్చర్ల:** మండల పరిధిలోని గొల్లపల్లి సమీపంలో 44వ నంబర్ జాతీయరహదారిపై శనివారం రోడ్డు దాటుతుండగా లక్ష్మి అనే మహిళ ప్రమాదానికి గురైంది. పోలేపల్లి పంచాయతీ పరిధిలోని గుండ్లగడ్డతండాకు చెందిన ఆమెను గుర్తితెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే చికిత్స కోసం ఆమెను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.ఈమేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### ఉద్యోగ భద్రత కల్పించాలి

**మహబూబ్‌నగర్ న్యూటౌన్:** క్షేత్ర స్థాయిలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ హన్వాడ ఫీల్డ్ అసిస్టెంట్లు శనివారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసి విన్నవించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటయ్య, నారాయణగౌడ్, బి.వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

### నేడు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

**గండీడ్:** ప్రకృతి వ్యవసాయంపై జక్లపల్లిలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ పనిముట్ల సేవా కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు వివరించారు. 25 రకాల కూరగాయల సాగుపై అవగాహన, విత్తనాల పంపిణీ తదితర కార్యక్రమాలు ఉంటాయని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



భూత్పూర్‌లో భిక్షాటన చేస్తున్న పంచాయతీ కార్మికులు

**మహబూబ్‌నగర్ రూరల్:** గ్రామపంచాయతీ కార్మికులు పదిరోజుల నుంచి సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు జె.చంద్రశేఖర్ అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ప్రధాన కార్యదర్శి రాఘవేంద్రయాదవ్, నాయకులు పాల్గొన్నారు.

**నవాబుపేట:** మండలంలో కార్మికుల జేఏసీ నాయకులు లక్ష్మయ్య, శ్రీను, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**కోయిల్‌కొండ:** మండలంలో ఐఎఫ్‌టీయూ మండల అధ్యక్షుడు శ్రీనునాయక్, కార్మికులు చెన్నయ్య, వెంకటయ్య, అజ్జు, పాష, రాందాస్ పాల్గొన్నారు.

**దేవరకద్ర:** పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇఫ్టూ జిల్లా కార్యదర్శి సాంబశివుడు ఆధ్వర్యంలో తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు.

**చిన్నచింతకుంట:** మండలంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ నాయకులు ఆర్ఆర్ మన్యం, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జేఎస్ దేవదానం, నాయకులు పాల్గొన్నారు.

**భూత్పూర్:** మండల కేంద్రంలోని చౌరస్తాలో కార్మికులు భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు మైబు, కార్యదర్శి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

**గండీడ్:** మండల కేంద్రంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్మికులు సమ్మె కొనసాగించారు. శిబిరం వద్దే వంట చేసుకొని, భోజనం చేశారు.

## కాపరుల సంక్షేమానికి కృషి



గొర్రెలను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

**అడ్డాకుల:** గొర్రెల కాపరుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు జి.ఇంద్రయ్యసాగర్ అన్నారు. మూసాపేట, నిజాలాపూర్, నందిపేట గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు శనివారం ఆయన గొర్రెలను పంపిణీ చేశారు. కాపరులు వృద్ధిలోకి వచ్చి ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. పశువైద్యాధికారి మధుసూదన్, రైతు బంధు అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మీ నరసింహ, వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ గోవర్ధన్, నాయకులు ఉన్నారు.

### జడ్చర్లలో భారీవర్షం



ప్రధాన రోడ్డుపై నిలిచిన నీరు

**జడ్చర్ల టౌన్:** పట్టణంలో శనివారం రాత్రి భారీవర్షం కురిసింది. సీజన్ ప్రారంభం అయ్యాక ఇదే పెద్ద వర్షం గమనార్హం. వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రధాన రోడ్డుపై బృందావనం హోటల్ నుంచి పాత మంజు హోటల్ వరకు వరదనీరు పారటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. నల్లకుంట ఆపై నుంచి వచ్చే వరదనీరు ఎటూ పోలేక రోడ్డుపై నిలవడంతో కుంటలను తలపించాయి. పట్టణంలోని కొన్ని కాలనీల్లోనూ వరద నీటితో ఇబ్బందులు తలెత్తాయి.

## చెరువుకట్టలపై ఈత మొక్కలు నాటాలి



ఈత మొక్కలు నాటుతున్న అధికారులు

**కోయిల్‌కొండ:** గ్రామాల్లోని చెరువు కట్టలపై ఈత మొక్కలను నాటేందుకు పంచాయితీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ జయరాములు సూచించారు. శనివారం రాంపూర్ చెరువు కట్టపై ఈత మొక్కలు నాటారు. గీత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఉచితంగా ఈత మొక్కలను అందిస్తోందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ రాములు, ఏపీవో నర్సయ్య, టెక్నికల్ అసిస్టెంట్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## మారుమూల గ్రామాలకు రోడ్డు



పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

**నవాబుపేట:** మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రత్యేక నిధులు కేటాయించారని జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు తెలిపారు. కొండాపూర్ గ్రామంలో చాకలపల్లి వరకు మారుమూల గిరిజనతండాలను కలుపుతూ వెళ్లే రోడ్డు పనులను శనివారం ప్రారంభించారు. ఎంపీపీ అనంతయ్య, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, సర్పంచ్ భోజమ్మ పాల్గొన్నారు.

## పాఠశాల స్థాయి నుంచే లక్ష్యం ఎంచుకోవాలి



విద్యార్థినిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

**గండీడ్:** పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు తమ జీవిత లక్ష్యాలను ఎంచుకోవాలని ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వెన్నాచేడ్ ఉన్నత పాఠశాలలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మండలంలో అన్ని పాఠశాలలో పదోతరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు బహుమతి అందించడంతో పాటు, శాలువా పులమాలలతో సన్మానించారు. ప్రశంసా పత్రాలను అందజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం సంకల్పించిందని అన్నారు. కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దుతుందని వివరించారు. వసతుల కల్పనతో పాటు ఫర్నిచర్, అదనపు గదులు, ప్రహరీలు వంటి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పీపీసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బోరు కృష్ణయ్య, హెచ్ఎం శంకరయ్య, సర్పంచ్ పుల్లారెడ్డి, యువజన సంఘం అధ్యక్షుడు గుర్రాల చెన్నయ్య, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## లోకకల్యాణార్థం ఆలయాల సందర్శన



పెద్దగుట్ట ఆలయం వద్ద శివకుమార్ తదితరులు

**జడ్చర్ల టౌన్:** లోకకల్యాణార్థం, జడ్చర్ల ప్రాంతం సుభిక్షంగా ఉండాలనే లక్ష్యంతో స్థానిక దేవాలయాల సందర్శన చేస్తున్నట్లు రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి. శివకుమార్ తెలిపారు. శనివారం బాదేపల్లి పెద్దగుట్టపై రంగనాయకస్వామి ఆలయాన్ని సందర్శించారు. దీంతో 108 ఆలయాల దర్శనం పూర్తయినట్లు వివరించారు. కౌన్సిలర్లు ఉమాశంకర్‌గౌడ్, రమేష్, శ్రీశైలమ్మ, నాయకులు రంజిత్‌బాబు, నర్సింహులు, పరమటయ్య, శ్రీనివాస్‌గౌడ్, రవితేజ ఉన్నారు.

## నెరవేరనున్న పాలమూరు చిరకాలస్వప్నం



టన్నెల్ పనులను వివరిస్తున్న ఏఈ శశిధర్

**రాజాపూర్:** పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి అయితే జిల్లాలోని ప్రతి ఎకరాకుసాగునీరు అందుతుందని, చిరకాలస్వప్నం సాకారం అవుతుందని డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు శ్రీశైలంయాదవ్‌తో, బీఆర్ఎస్ నాయకులతో కలిసి పాలమూరు ప్రాజెక్టు టన్నెల్ పనులను పరిశీలించారు. కేసీఆర్ ముందుచూపుతో మరో మూడునెలల్లో కర్వెన ప్రాజెక్టు పనులు పూర్తి కానున్నాయని అన్నారు. మరో ఏడాదిలోపు ఉదండాపూర్ ప్రాజెక్టు సైతం పూర్తి అవుతుందని వివరించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఏఈ శశిధర్ ప్రాజెక్టు వివరాలను వివరించారు. ఉపసర్పంచ్ అల్లెశ్రీనివాస్, నాయకులు తదితరులు ఉన్నారు.

### గోరింటాకు పోటీలు

**జడ్చర్ల టౌన్:** మున్సిపాలిటి పరిధిలోని 24వ వార్డులో ఆషాఢమాసం పురస్కరించుకుని శనివారం మనసేవాసమితి ఆధ్వర్యంలో గోరింటాకు పోటీలు నిర్వహించారు. పోటీల్లో కాలనీలోని మహిళలు ఉత్సాహంగా పాల్గొని వివిధ ఆకృతుల్లో గోరింటాకు పెట్టుకున్నారు. విజేతలకు వార్డు కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్‌రెడ్డి బహుమతులు అందజేశారు. సమితి అధ్యక్షుడు వేణు, సభ్యులు రవీందర్ రెడ్డి, రఘు పాల్గొన్నారు.

### నర్సరీని పరిశీలించిన అధికారులు

**దేవరకద్ర:** ఈఓ సీత్యానాయక్, సర్పంచ్ విజయలక్ష్మి దేవరకద్ర మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని నర్సరీని శనివారం పరిశీలించారు. నాటడానికి మొక్కలు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీలో జరిగిన సమావేశంలో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు బాల్‌రాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

### పాలమూరు ఎంఈగా బస్వరాజ్

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** స్థానిక మున్సిపాలిటీలో ఎంఈగా యు.బస్వరాజ్ బదిలీపై రానున్నారు. శనివారం రాత్రి రాష్ట్ర ప్రజారోగ్య శాఖ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటివరకు ఈయన జీహెచ్ఎంసీలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు (ఈఈ) గా పని చేశారు. ఇక మున్సిపాలిటీలో డిప్యూటీ ఈఈగా పనిచేస్తున్న ఎస్‌వీఆర్ఎస్ఆర్‌డీ సుబ్రమణ్య ఇన్‌చార్జ్ ఎంఈ (ఎఫ్ఏసీ) గా వ్యవహరిస్తున్నారు. ఇక నుంచి ఈయన డిప్యూటీ ఈఈగానే విధులు నిర్వహిస్తారు. సుమారు మూడేళ్లుగా ఇన్‌చార్జ్ లతో కొనసాగుతున్న ఈ విభాగానికి ఎట్టకేలకు రెగ్యులర్ ఎంఈ ని నియమించడంతో మిగతా వారిపై పనిభారం తగ్గనుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.